

ట్రెజరీకి చేరిన 'రైతు భరోసా' నిధులు

- నేడో.. రేపో రైతుల ఖాతాల్లో జమ
- జిల్లాలో 2,10,904 మంది అన్నదాతలకు పెట్టుబడి సాయం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానాకాలం సాగుకు రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు భరోసా నిధులను వెంటనే ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం సాయంత్రం వరకు ట్రెజరీకి నిధులను జమ చేసింది. ఈ సీజన్‌లో జిల్లాకు చెందిన 2,10,904 మంది రైతులకు 211.9 కోట్ల రూపాయలను పెట్టుబడి సాయంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు సంబంధించిన వివరాలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారులు 1,93,958 మంది వివరాలను అప్‌డేట్ చేసి ప్రభుత్వానికి వివరాలు అందించారు. ఒకటి రెండు రోజుల్లో మిగతా రైతుల వివరాలు అప్‌డేట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం 1,68,218 మంది రైతులకు వారికున్న భూమి విస్తీర్ణం మేరకు 139.08 కోట్ల రూపాయలను ట్రెజరీకి పంపించింది. మంగళ, బుధవారాల్లో ఆ డబ్బు రైతుల ఖాతాల్లో జమ కానున్నదని అధికారులు తెలిపారు. ఈ నెల 25 వరకే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఆ మేరకు సోమవారం ట్రెజరీలకు నిధులు విడుదల చేశారు.

3,53,178 ఎకరాల సాగుభూమి

జిల్లాలో ఈ సంవత్సరం ఎకరాకు ఆరు వేల రూపాయల చొప్పున ప్రభుత్వం రైతులకు రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నది. జిల్లా రైతులకు 211,90,69,841 రూపాయలు విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. వారి పట్టాల్లో 3,53,178 ఎకరాలు నమోదై ఉన్నట్లు తేలింది. ఈ సంవత్సరం వానాకాలంలో 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని ప్రధానంగా 2,76,500 ఎకరాల్లో వరి, 48 వేల ఎకరాల్లో పత్తి, నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న, 13,045 ఎకరాల్లో కూరగాయలు, ఇతర హార్టికల్చర్ సాగు జరుగుతుందని వ్యవసాయశాఖ పేర్కొన్నది. సాగులో ఉన్న ప్రతి ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఇవ్వడానికి నిర్ణయించింది.

'బెస్ట్ అవైలబుల్' ప్రవేశాలు ఉండేనా?

- జిల్లాలో 15 పాఠశాలలకు రూ. 10 కోట్ల బకాయిలు
- రెండేళ్లుగా డబ్బు విడుదల చేయడం లేదంటున్న యాజమాన్యాలు
- 20 వరకు చెల్లించాలని వినతి
- లేకపోతే పాఠశాలలు మూసివేయాల్సి వస్తుందని ఆవేదన



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'బెస్ట్ అవైలబుల్ స్కూల్' పథకం అమలుపై ఈ సంవత్సరం అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి మెరుగైన విద్యనందించేది. ఈనెల 16తో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ముగిసింది. వారం రోజుల్లోగా విద్యార్థులకు ప్రవేశాలు ఖరారు చేయాలి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బకాయిల కోసం ఆందోళన చేపడుతున్నాయి. ఈ నెల 20 వరకు బకాయిలు చెల్లించకపోతే అడ్మిషన్లు తీసుకోబోమని యాజమాన్యాల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకం కింద 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 237 స్కూళ్లను బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుగా గుర్తించిన ప్రభుత్వం వాటిల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చేర్చి విద్యను అందిస్తున్నది.

పేరుకుపోయిన బకాయిలు

జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, గంగాధర మండల కేంద్రాల్లో 15 పాఠశాలలు ఈ పథకాన్ని అమలు చేసున్నాయి. ఈ పాఠశాలల్లో 1200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలకు 10 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా రెండు సంవత్సరాలుగా 200 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అంటున్నది. ఈ బకాయిలను ఈ నెల 20 వరకు విడుదల చేయాలని, లేకపోతే తాము పాఠశాలలకు తాళం వేయడం మినహా గత్యంతరం లేదని ఆ సంఘం ప్రభుత్వానికి విన్నవించింది. తాము పాఠశా లలు మూసివేస్తే ప్రస్తుతం చదువుతున్న 25 వేల మంది విద్యార్థులు ఇబ్బంది పడతారని ఆ సంఘం ప్రభుత్వానికి విన్నవించింది. ప్రభుత్వం రాష్ట్రంలో ఈ పథకాన్ని సదుద్దేశంతో ప్రవేశపెట్టినప్పుడు కార్పొరేట్ పాఠశాలలేవి ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించకున్నా బడ్జెట్ పాఠశాలలుగా ఉన్న తాము అందుకు సిద్ధపడి అడ్మిషన్లు ఇచ్చామని తెలిపాయి. అయినా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయడం లేదని సంఘం వాపోతున్నది.

పదో తరగతిలో 98 శాతం ఉత్తీర్ణత

గడిచిన విద్యాసంవత్సరం బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో మూడు వేల మంది విద్యార్థులు పదో

(మిగతా 8వ పేజీలో)

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలకు గడువు ఈ నెల 28

- ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాల స్వీకరణ కోసం ఈ నెల 28తో గడువు ముగియనుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సుడా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాస్టర్ ప్లాన్, ఇంతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల తర్వాత అమలయ్యే నూతన మాస్టర్ ప్లాన్‌పై అవగాహన కల్పించడానికి మూడు నెలల సమయం ఇచ్చామన్నారు. సమయం ముగిసిన తర్వాత ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోబోమని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో ఆంజనేయులు, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈ రాజేంద్రప్రసాద్, ఏఈ సతీష్, ఏసీపీలు బషీర్, వేణు, శ్రీధర్, ప్రసాద్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సముదాయాలు, మద్యం దుకాణాల యజమానులు చెత్తను తడి, పొడిగా వేరుచేసి నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా లక్ష్మీనగర్, ఆదర్శనగర్, మంచిర్యాల చౌరస్తా, తదితర ప్రాంతాలను పారిశుధ్య అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఆదర్శనగర్‌వద్ద మద్యం దుకాణాదారులు షాపు ఎదుట పరిసర ప్రాంతంతోపాటు డ్రైనేజీల్లో చెత్తను వేసినందుకు రెండు షాపులకు 20 వేల జరిమానా విధించారు. లక్ష్మీనగర్‌లో ఓపెన్ స్థలంలో వర్షం నీరు నిలిచిన ప్రాంతాన్ని తనిఖీ చేసి ఖాళీ స్థలంలోని నీటిని కచ్చా నాలా ద్వారా తొలగించి స్థల యజమానికి జరిమాన విధించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నగర ప్రజలు విషజ్వరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రోడ్లు, పరిసర ప్రాంతాల్లో చెత్త వేయడాన్ని నిషేధించామన్నారు. నిబంధ నలు అతిక్రమించి చెత్తను పరిసరాలు, డ్రైనే జీల్లో వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చ రించారు.. వర్షాకాలంలో విషజ్వరాలు రాకుండా తగిన నివారణ, జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. నగర ప్రజలు పరిశుభ్రతను పాటిస్తే అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నరోత్తమ్‌రెడ్డి, శ్రీధర్, డీఆర్ఎఫ్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపులు బాధాకరం

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్

కరీంనగర్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):రోజురోజుకు వయోవృద్ధులపై వేధింపులు పెరిగిపోతుండడం బాధాకరమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేష్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వయోవృద్ధుల వసతి గృహంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ మాట్లాడుతూ పెద్దలు, వయోవృద్ధుల సలహాలు, మార్గ నిర్దేశం వల్లనే వారి పిల్లలు వృద్ధిలోకి వస్తార న్నారు. ఈ సందర్భంగా ఏ విధమైన న్యాయ సలహాలకైనా, సమస్యలకైనా టోల్ ఫ్రీ నం బర్ 15100కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, వయోవృద్ధుల గృహ నిర్వాహకురాలు రాధిక పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకుని సందేహాలను నివృతి చేసుకోవాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో సెక్టార్, ఇన్వెస్టిగేటింగ్ అధికారు లుగా విధులు నిర్వహిస్తున్న 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు సీపీటీసీలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా ఫిర్యాదు అందుకోవడం నుంచి ఎఫ్ఐఆర్ నమోదు, క్రైమ్ సీన్‌ను సందర్శించడం, సాక్ష్యాధారాలు సేకరించడంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనరేట్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, శ్రీనివాస్, సరిలాల్, బిల్లా కోటేశ్వర్ పాల్గొన్నారు.

కేజీబీవీలకు మహర్దశ

- జిల్లాలో కొత్తగా మరో రెండు పాఠశాలలకు అప్‌గ్రేడేషన్
- మౌలిక వసతుల కోసం నిధుల విడుదల



కరీంనగర్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ విద్యాలయాలకు మంచిరోజులొచ్చాయి. కొన్నేళ్లుగా నిర్వహణకు, నూతన భవ నాలకు నిధులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 50 శాతం నిధులు మంజూరు చేయగా పనులు చేపట్టేందుకు సంబంధిత ఇంజనీర్లు ఆయా కేజీబీవిలను పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి..

జిల్లాలో గత సంవత్సరం వరకు 14 కేజీబీవీలు ఉండగా ఈ సంవత్సరం కొత్తగా తిమ్మాపూర్, చిగురుమామిడి పాఠశాలలకు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. గత సంవత్సరం కేజీబీవీల్లో 2,890 విద్యార్థులు విద్యను అభ్యసించారు. వాటిలో ఆరోతరగతి నుంచి పదో తరగతి, కొన్నింటిలో ఇంటర్ వరకు బోధన చేపడుతున్నారు. చాలా చోట్ల మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదు. విద్యుత్ సమస్యలు, పైప్‌లైన్లు సరిగా లేవు. హీటర్లు పాడయ్యాయి. ఆర్వో ప్లాంట్లు మూలకు పడ్డాయి. వీటన్నింటికి పనులు చేయడం కోసం విద్యాలయాల అవసరాన్ని బట్టి ఒక్కో దానికి ఐదు లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు నిధులు మంజూరయ్యాయి. గంగాధర కస్తూర్బాకు 5లక్షల రూపాయలు మంజూరు కాగా మిగతా పాఠశాలలకు కూడా అవసరాలను బట్టి మొదటి విడత నిధులు మంజూరయ్యాయి. జిల్లాకు రెండు కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా మొదటి విడతలో 1.20 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. దీంతో కొన్ని పాఠశాల్లో, కళాశాలల్లో పనులు ప్రారంభం కాగా మరి కొన్నిటిలో త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

మారిన మెనూ..

ఈ విద్యాసంవత్సరం నుంచి కేజీబీవీల్లో కొత్త రుచులతో నూతన మెనూ అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ ఏడాది నుంచి కొత్త వంటలు వడ్డించనున్నారు. నెలలో రెండు సార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గడ్లు, ప్రతి రోజు నెయ్యి వడ్డిస్తారు. కొత్త మెనూను అమలు చేసే బాధ్యతను ప్రభుత్వం విద్యాశాఖకు అప్పగించింది. కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మారిన మెనూ పాఠశా లలు పునఃప్రారంభమైన గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటికి ఇంటర్‌నెట్ ఇంకెప్పుడు?
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
6

గుట్టల మట్టి మాయం..
- వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
7

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పనులు చేసేటప్పుడు జాగ్ర త్తగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వ ర్తించాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఆయన 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈ టెక్నికల్స్‌తో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రమాద భరితంగా ఉన్న లూజ్ లైన్ల, వంగిన పోల్స్‌ను సరిచేయాలన్నారు. రైతులు, వినియోగదారులు వారి పరిధిలో లూజ్ లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్‌లను గుర్తించి తమ పరిధిలోని సెక్షన్ ఆఫీసర్‌కి తెలి యజేయాలని కోరారు. సర్కిళ్ల పరిధిలో వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ మరమ్మతులు చేయవద్దన్నారు.అవసరమున్నప్పుడు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి సర్కిల్ లోని డీఈ టెక్నికల్ ఆధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని, జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సబ్ డివిజన్, సెక్షన్ వారిగా విద్యుత్ భద్రతపై సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి అశోక్‌కు మార్, టి మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు ఉత్తమ్, సురేందర్,డీఈఅనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణకు నిధులు కరువు

కార్యదర్శులపై అదనపు భారం



చెర్లబూత్కూర్ గ్రామ పంచాయతీ

కరీంనగర్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు నిధులు లేక నీరసపడుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించి యేడాది దాటింది. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి నిధులు విడుదల కావడం లేదు. దీంతో నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. కొంత మంది కార్యదర్శులు తమ జీతాల నుంచి ఖర్చు చేస్తుండగా మరికొందరు అప్పులు తెచ్చి పంచాయతీలను నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లో నిత్యం చెత్త సేకరణ చేపట్టాలి. ఇలా సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలి. ట్రాక్టర్ల వినియోగానికి డీజిల్ ఖర్చులతోపాటు వాటి నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్లు ధ్వంసమైనా, మోటార్లు కాలిపో యినా, గ్రామ సభలు, ప్రభుత్వ అధికారిక కార్య క్రమాలు నిర్వహించినా పంచాయతీ కార్యదర్శులే భరిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో పని చేసే సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు రావడం లేదు.

ఆదాయం లేక ఇబ్బందులు

16 నెలలుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మేజర్ గ్రామ పంచాయతీలకు నెలకు రెండు లక్షలు, చిన్న గ్రామ పంచాయతీలకు లక్ష రూపాయల చొప్పున ఖర్చు అవుతుంది. ఖర్చులు పెట్టి నిధుల విడుదల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికి నిధులు విడుదల కాకపోవడంతో తలకు మించిన భారం అవుతుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా మూడు గ్రామ పంచాయతీలైన దుర్శేడ్, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాలు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 24 వేల జనాభా ఉంది. గ్రామ పంచాయతీల్లో చిన్న గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లు నెలకు లక్ష రూపాయలు వస్తుంది. వచ్చే రాబడి లేక కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే నిధులను మంజూరు చేసి కార్యదర్శులపై భారం తగ్గించాలని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణ

- జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో



గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యం పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నాం. సిబ్బంది వేతనాలు సమయానుకూలంగా ప్రభుత్వం చెల్లిస్తుంది. గ్రామాల అభివృద్ధిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రభుత్వం నుంచి విడుదల య్యే నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ అవుతాయి. కార్యదర్శులకు గ్రామ పంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారినప్పటికి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా పనులు చేపడుతున్నాము.

ప్రజావాణికి 307 దరఖాస్తులు

సుభాష్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 307 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ గ్రామంలో తేజస్విని(26) అనేవివాహిత సంతానం కావడం లేదని మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలజిల్లా జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కోడిపెల్లి లక్ష్మి-కిషన్‌ల కూతురు తేజస్విని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన జెల్ల సతీష్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. అప్పుడప్పుడు తేజస్విని తనకు పెళ్లై 5సంవత్సరాలు అవుతున్నా సంతానం కావడం లేదని బంధువులకు చెబుతూ బాధపడేది. పిల్లలు పట్టడం లేదని మనోవేదనకు గురై ఈనెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తేజస్విని ని జమ్మికుంటలోని ఓప్రైయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేపించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తల్లి కోడిపెల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి మీదకు వచ్చి ఇష్టం వచ్చినట్లు దూషించడంతో అవమానభారంతో మందు గోళీలు వేసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీకి చెందిన పకిడే రవి అనేవ్యక్తి సల్ల రాజమ్మ దగ్గర అవసరం నిమిత్తం రూ.70వేలు అప్పుగా తీసుకున్నాడు. రాజమ్మ భర్త సమ్మయ్య సోమవారం అప్పుతీసుకున్న రవి ఇంటిమీదకు వచ్చి డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ నానా బూతులు తిట్టాడు. పరువు పోయిందని భావించిన రవి భార్య కవిత ఇంట్లో ఉన్న మందు గోళీలు(టాబ్లెట్స్) అన్ని ఒకేసారి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అగ్గ ఆశన్న(59) అనేవ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. ఆశన్నకు సంతానం లేకపోవడంతో పాటు భార్య మల్లుతో కుటుంబ కలహాలు రావడంతో కొంతకాలంగా ఆమె రాయికల్‌లో తల్లి గారి ఇంట్లో ఉంటోంది. దీంతో ఆశన్న మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్జాలో కరీంనగర్‌వాసి మృతి


ఖాజా మెహరాజ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఖాజా మెహరాజ్(46) ఆదివారం రాత్రి షార్జాలో మృతి చెందాడు. ఖాజా ఎనిమిదేళ్లుగా షార్జాలో అల్‌ఖైరిన్‌బాయ్స్‌పాఠశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కరీంనగర్ నుంచి ఆయన కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో అక్కడేఉన్న వారిబంధువులకు సమాచారం అందించారు. బంధువులు ఆయన గదికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మెహరాజ్‌కు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని సోమవారం సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సీఐ మాట్లాడుతూ ఈనెల15నసాయంత్రం 5గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామఎక్స్‌రోడ్డు వద్ద ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. ఆసమయంలో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపునకు వస్తుండగా వారిని ఆపి తనఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారివద్ద ఉన్న బ్యాగులో 5కిలోల గంజాయి లభించింది. గంజాయితో దొరికిన నిందితులలో వేములవాడ మండలం, నాగయ్యపల్లి గ్రామానికి చెందిన గొంటి నగేష్(19), కోనరావుపేట మండలం, మట్టిమల్ల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్(19), వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన కుత్తడి భరత్(19) ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ఒడిస్సా నుంచి గంజాయి: గంజాయి తాగడానికి బానిసై పోలీసులకు దొరికిన ముగ్గురు జల్సాలకు అలవాటు పడ్డారు. గంజాయి కొనుగోలు చేసి అనంతరం ఎక్కువ ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకొని నాలుగు రోజుల క్రితం బైక్‌పై ఒరిస్సాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారన్నారు.



ఇంటింటికీ ఇంటర్నెట్ ఇంకెప్పుడు?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

భగత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇంటర్‌నెట్ సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన టీ-ఫైబర్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గ్రామాల్లో సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతో పాటు, ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. 2015 సంవత్సరంలో ప్రారంభమైన పనులు 2022 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా


ఇంటర్‌నెట్ కోసం కొత్తపల్లి మండలంలో వేసిన పైపులైన్

నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాతాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంలేదు.

పైప్‌లైన్‌తోనే సరి...

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 313 గ్రామ పంచాయతీలు ఉండగా, గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీ ఎస్, విద్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు ఒక జీబీపీఎస్ కనీస వేగంతో బ్రాడ్ బ్యాండ్ సేవలను తక్కువ ధరలకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్‌నెట్‌లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ మిషన్ భగీరథ పైపులైన్‌తోపాటు అండర్ గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టికల్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణ పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలను అనుసంధానం చేశారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సోలార్ ఇన్వర్టర్లు ఏర్పాటు చేశారు. పెండింగ్ పనులను నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఇంటర్‌నెట్ కనెక్షన్లు అందుబాటులోకి రావడం లేదు. విస్తృత ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

మాన్యువల్‌గానే పనులు

గ్రామ పంచాయతీల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంతో ఇప్పటికీ కార్యకలాపాలు మాన్యువల్‌గానే సాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైనా సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వివిధ అనుమతి పత్రాలు, లైసెన్స్ రసీదులు ఏదీ కావాలన్న కాగితంపై రాసి ఇస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ ఫైళ్ల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన చెక్కులు, జీతాల రసీదులు ఇలాంటి పనులన్నీ మాన్యువల్‌గానే చేస్తున్నారు. ప్రతి నెల ఆదాయ వ్యయాలను ఆన్‌లైన్ అడిట్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పనులన్నింటికి ఇంటర్‌నెట్ అవసరం ఉంటుంది.

టీ-ఫైబర్ ప్రారంభిస్తే అందుబాటులోకి ఎన్నో సేవలు

గ్రామీణప్రాంతాల్లో టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తే ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామాల్లో రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బందికి ఆన్‌లైన్‌లో పలు విషయాలు అప్‌లోడ్ చేస్తుంటారు. టీ- ఫైబర్ పనిచేయడం ప్రారంభమైతే ఈ బ్యాంకింగ్, ఈ గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి మెడిసిన్ వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ క్లాస్ లాంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

పనులు వెంటనే పూర్తి చేయాలి: కడారి రతన్‌కుమార్, ఎలగందల్



ప్రస్తుత కాలంలో ప్రతి విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉన్నది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

మహిళపై దాడి

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న కాశపల్లిలో సోమవారం ఓ మహిళపై దాడి జరిగింది. కాశపల్లిలో కొందరు గొడవ పడుతుండగా ఫాతిమా అనే మహిళ అడ్డుకోవడంతో అందులో ఒకరు ఆమెను కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయమైంది. ప్రస్తుతం ఆమెపరిస్థితి విషమంగా ఉంది. సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకురాగా వరంగల్ ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు గాయపడ్డ మహిళను కరీంనగర్ తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

- 9మందికి జరిమానా

కోల్‌సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంసేవించి వాహనాలు నడిపిన ఉప్పల నరేష్, ఆసంపల్లి నగేష్‌లకు మూడు రోజుల జైలు శిక్షను రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 9మందికి రూ.14వేల జరిమానా విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కారు, బైక్ ఢీ

ముత్తారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, బగుళ్ల పుణ్యస్నానానికి వెళ్లేదారిలో పోతారం చెందిన కట్ల పవన్ ద్విచక్రవాహనానికి కారు ఢీకొట్టడంతో పవన్‌కు తల, ఛాతిభాగంలో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పవన్‌ను చికిత్సనిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పై కప్పు తొలగించిన మనవడు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

శంకరపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో ఇంటి పైకప్పును మనవడు తొలగించాడని వృద్ధజంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కొమురమ్మ-కనకయ్యలకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు గణేష్ చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా కొమురమ్మ-కనకయ్య రాజాపూర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న కొమురమ్మ-కనకయ్యకు తోడుండాల్సిన మనవడు అదేం పట్టకుండా వీరిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 10న మనవడు ఉదయ్, పెద్దకోడలు లక్ష్మి కలిసి ఇంటిపై కప్పును తొలగించి, ఇంటి గోడను కూడా కూల్చివేసినట్లు తెలిపారు. దీంతో వారు కేశవపట్నం పోలీసులను ఆశ్రయించారు. వృద్ధదంపతులకు ఆసరాగా ఉండి చేరదీయాల్సిన పెద్దకోడలు, మనవడు ఉండేందుకు గూడు లేకుండా ఇంటి పైకప్పుతొలగించి గోడలు కూల్చి వేయడంతో గ్రామంలో చుట్టుపక్కల వారి ఇళ్లలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడిందని గోడు వెళ్లబోసుకున్నారు. కాగాబ్లూకోర్టు పోలీసులు రాజాపూర్ గ్రామానికి చేరుకొని ఇంటిపైకప్పు తొలగించి గోడలు కూల్చివేసిన ఘటనపై వివరాలు సేకరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో ఓఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా, స్వామి, అమీర్, శంకర్, రాజు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. వారినుంచి రూ.8,200నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండుబైకులు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

హత్యాయత్నం కేసులో తొమ్మిది మంది రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో భూ వివాదంలో కొలకాని పరశరాములు, అతని కుటుంబ సభ్యులపై ఈ నెల 14న హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో ప్రధాన నిందితుడైన కొలకాని శ్రీనివాస్‌తో సహా 9మందిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ వివరాల ప్రకారం... పట్టణంలోని చంద్రంపేట గ్రామంలో కొలకాని అంజయ్య, అతని సోదరుడి కుమారులైన కొలకాని శ్రీనివాస్, నాగరాజుల మధ్య గత కొన్ని రోజుల నుంచి ఇంటి స్థలం వివాదం నెలకొంది. దీంతో నాగరాజు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలాన్ని జేసీబీతో చదును చేయడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న శ్రీనివాస్, నాగరాజులు మరికొంత మందితో కలిసి అంజయ్య కుటుంబాన్ని చంపితే భూమి తమ వాళ్లకే చెందుతుందని పథకం పన్నారు. ఈ పథకం ప్రకారం అంజయ్య కుటుంబ సభ్యులను శ్రీనివాస్, నాగరాజు, మంగ, మమత, ఎల్లవ్వలు కలిసి బూతు మాటలు తిడుతూ వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన వేముల పెద్దభూమయ్య, అతని కుమారులు నాగరాజు, ప్రశాంత్‌లు కలిసి పర్శరాము లును దొరకబట్టడంతో వెంటనే అతనిపై శ్రీనివాస్ కత్తితో దాడిచేసి పొడిచాడు. పర్శరాములు తండ్రి అంజయ్య, తల్లి లచ్చవ్వను బండరాయితో దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రధాన నిందితుడైన శ్రీనివాస్ ఓ న్యాయవాది ద్వారా కోర్టులో సరెండర్ అయ్యాడు. సరెండర్ అయిన శ్రీనివాస్‌తో పాటు చంద్రంపేటకు చెందిన కొలకాని నాగరాజు, కొలకాని మంగవ్వ, కొలకాని మమత, కొలకాని ఎల్లవ్వ, వేములవాడ అర్బన్ మండలంలోని వేముల పెద్ద భూమయ్య, వేముల నాగరాజు, వేముల ప్రశాంత్, వేముల మల్లేశంలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై మహిళల ఆందోళన

ధర్మపురి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్దనక్కలపేట గ్రామపంచాయితీ ఎదుట సోమవారం పలువురు మహిళలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల మంజూరు పత్రాల్లో పలువురు అర్హులకు చోటు దక్కలేదని వాపోయారు. అనర్హులకు ఇళ్లు కేటాయించి తమకు అన్యాయం చేశారని మహిళలు ఆరోపించారు. కిరాయి ఉంటున్న వారిని, వితంతువులకు, దారిద్ర్యరేఖకు దిగువఉన్న వారికి ముందుగా ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మొదటి లిస్ట్‌లో లబ్ధిదారులుగా తమ పేరు వచ్చిందని, దీంతో తాము పాత ఇళ్లను కూల్చి వేసుకున్నా మని పలువురు మహిళలు తెలిపారు.

కానీ ప్రస్తుతం లిస్ట్‌లో పేరు లేదని, ఉన్న ఇళ్లు పోగొట్టుకున్నామని ఆకుల అనిల్ అనే వ్యక్తి ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మహిళలు డిమాండ్ చేశారు.


గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

పురుగుల మందు డబ్బాలతో ప్రజావాణికి రైతులు

- చెరువు భూమిని కాపాడాలని డిమాండ్



జగిత్యాల కలెక్టరేట్‌కు పురుగుల మందు డబ్బాలతో వచ్చిన కొండాపూర్ గ్రామరైతులు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామ శివారులోని బూరుగుకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని, మరమ్మతు చేయించాలని రైతులు సోమవారం జగిత్యాల కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణికి క్రిమిసంహారక మందు డబ్బాలతో వచ్చి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు సంబంధిత రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాలను లాక్కున్నారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. చెరువు ప్రాంతంలో ఇటీవల భూమికొనుగోలు చేసిన సబ్బనవేణి అంజయ్య అనే వ్యక్తి చెరువు మత్తడిని, చెరువు కట్టను ధ్వంసం చేశాడని రైతులు ఆరోపించారు. చెరువులో నీరు నిలవకుండా చేసి శిఖం భూమిని సాగు చేస్తున్నాడని, దీని వల్ల చెరువు కింద ఉన్న తమ భూముల గుండా నీరు ప్రవహించి తమ పంట కొట్టుకు పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న తమ భూమి పనికి రాకుండా చేస్తున్నాడని రేగుల దేవమ్మ అనే వృద్ధురాలు రోదించింది. తమ సమస్యకు పరిష్కారం లభించకుంటే పురుగులమందు తాగుతా మని రైతులు హెచ్చరించారు. దీంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

బస్సులు ఆపడం లేదని మహిళల ఆందోళన

కథలాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్య్రాల స్టేజీ వద్ద ఆర్టీసీబస్సులు ఆపడం లేదని మహిళలు సోమవారం ఆర్టీసీ బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాండ్య్రాల స్టేజి వద్ద ఆర్టీసీబస్సులు ఆపకపోవడంతో కోరుట్ల, కథలాపూర్ ప్రాంతాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై గతంలో కోరుట్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించినా కనీస స్పందన లేదనివారు విమర్శించారు. మహిళలు అరగంటసేపు బస్సులను నిలిపివేయడంతో డిపోమేనేజర్ మహిళలతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు తాండ్య్రాలస్టేజీ నిలిపేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు.


తాండ్య్రాలలో ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లి చోరీకేసులో మరో నిందితుడిని పట్టుకుని, మూడు తులాల బంగారం రికవరీచేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. సోమవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో చోరీలో మూడవ నిందితుడు చందుర్తి మండలంకు చెందిన పిట్టల అరవింద్‌ను అరెస్టు చేసి విలేకరులతో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం ఈనెల 8న మండలంలోని వెంకటయ్యపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 33 తులాల బంగారం నగదు, వెండి ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. ఈ చోరీ కేసులో ఈనెల 13న ఇద్దరు నిందితులను పట్టుకుని 20తులాల బంగారం రికవరీ చేయగా సోమవారం మూడో నిందితుడిని పట్టుకుని మరో మూడు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులున్నాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్సై వంశీక్రిష్ణ, గంగాధర పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముప్పిడితోట గ్రామానికిచెందిన యువతి చెవుల సౌమ్య(25) జమ్మికుంటలోని తమ సమీప బంధువుల ఇంట్లో మూడు నెలలుగా ఉంటోంది. ఈనెల 14న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదు. ఈమేరకు ఆమె సోదరుడు సాయిచరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 10 మందికి స్వల్ప గాయాలు

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు లారీని ఢీకొనడంతో సోమవారం 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీనీ ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణం చేస్తున్న శివకుమార్, సుజాత, గంగనర్సు, పద్మ, వనిత, లక్ష్మి, కల్పన, ఉష్మా, మంజుల అనే ప్రయాణికులతోపాటు బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను స్థానికప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ సమీపాన మానేరు కెనాల్ వద్ద జరిగిన మెండే సతీష్ హత్యకేసును పోలీస్‌లు ఎట్టకేలకు ఛేదించారు. ఈనెల13న లింగన్నపేటకు చెందిన మెండే సతీష్‌ను బీరు సీసాలతో దాడిచేసి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం మూడు రోజులుగా పోలీస్‌లు తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు నిందితులను పోలీస్‌లు పట్టుకుని సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరళించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానికఎస్ఐ ప్రేమానందం తెలిపినవివరాల ప్రకారం.. మృతుడు మెండే సతీష్, అదే గ్రామానికి చెందిన నిందితులైన నర్మాల పవన్ కుమార్, భీమయ్యగారి రాజశేఖర్‌లు సుతారి పనికి వెళ్లేవారు. ఈ క్రమంలో మృతుడు సతీష్ తన అవసరాలకు భీమయ్యగారి రాజశేఖర్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు డబ్బుల కోసం ముగ్గురి మధ్య గొడవలు జరిగేవి. ఈనెల13న మానేరుకెనాల్ వద్ద నిందితుడైన పవన్ కుమార్, మృతుడు సతీష్ దావత్ చేసుకున్నారు. ఇదే క్రమంలో పవన్ కుమార్‌ను వారి సమీప బంధువులను సతీష్ అసభ్యకరంగా దూషించాడు. ఇదే విషయాన్ని రాజశేఖర్‌కు ఫోన్‌లో పవన్ చెప్పాడు. సతీష్‌ను చంపేద్దామని మనం అనుకున్నాం కదా.. ఇదే మంచి సమయం చంపేయంటూ ఫోన్‌లో రాజశేఖర్ పవన్‌కు చెప్పడంతో బీరు సీసాలతో తలపై, మెడపై సతీష్‌ను పవన్ కొట్టిచంపేశాడు. సతీష్‌ను హత్య చేసిన పవన్‌ను, హత్యకు ప్రోత్సహించిన రాజశేఖర్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరళించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యకు సంబంధించిన నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన స్థానిక ఎస్ఐ ప్రేమా నందం, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా అభినందించారు.







మైమరపించే ప్రకృతి అందాలు

షూటింగ్, పిక్నిక్ స్పాట్‌గా బతుకమ్మ కుంట ప్రాంతం

ఇటీవల కురిసిన వర్షాలతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంది.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రం సమీపంలోని బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు ఎటు చూసినా పచ్చదనంతో మైమరపింపజేస్తున్నాయి. జగిత్యాల-కమ్మునూరు రోడ్డుకు రెండు వైపులా పచ్చని టేకు చెట్లతో వాహనదారులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు షూటింగ్‌లకు అనుకూలంగా ఉంది. ఈ ప్రాంతంలో ఫోక్ సాంగ్స్, షార్ట్‌ఫిలింల చిత్రీకరణ జరుగుతుంటుంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ ఈ ప్రాంతంలో జరుపుతుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో పలువురు పర్యాటకులు ఇక్కడికి పిక్నిక్‌కు వస్తుంటారు. మధ్యలో కుంట, చుట్టు పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - సారంగాపూర్, ఆంధ్రజ్యోతి

పోలీసు ఉద్యోగం..

సమాజ సేవకు లభించిన అవకాశం

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



పీటీసీలో మొక్క నాటుతున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉద్యోగానికి ఎంపికవడం సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గతంలో వెలువడిన పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఎంపికై వివిధ కారణాలతో హాజరుకాని 91 మందికి కరీంనగర్ పీటీసీలో సోమవారం శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ పోలీసుశాఖ మొదటి స్థానంలో నిలిచిందని, తొమ్మిది నెలల పాటు అందించే శిక్షణను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధి నిర్వహణలో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించిన సీపీ పీటీసీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కాలేజ్(పీటీసీ) ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ మోహన్(డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేష్‌బాబు, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి, గంగాధర్, శివరామయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా

అభివృద్ధి పనులు

- వేములవాడలో రోడ్ల విస్తరణతో సుదీర్ఘ నిరీక్షణకు తెర
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగిన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా ఇళ్లను కూల్చివేసే కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టే క్రమంలో రోడ్ల వెడల్పు పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు అవసరమైన పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గత నవంబరు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 8 మంది మంత్రుల సమక్షంలో 76 కోట్లతో ఆలయ విస్తరణ, 47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, 35 కోట్లతో అన్నదాన సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధితో పాటు, వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 కోట్లు, 25-26 బడ్జెట్లో 100 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని గత 30 ఏళ్లుగా స్థానికులు కోరుకుంటున్నారని, గత ప్రభుత్వంలోగా కేవలం మాటలకు శంకుస్థాపనలకు పరిమితం



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కాకుండా అభివృద్ధిని ఆచరణలో చూపిస్తూ రోడ్ల వెడల్పు పనులు ప్రారంభించామని అన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని నాలుగు ఎకరాలలో విస్తరించేందుకు ఇప్పటి వరకు నాలుగు సార్లు శృంగేరి పీఠాధిపతి వద్దకు వెళ్లి వారి సలహాలు సూచనలు స్వీకరించి, వాటి ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని, శ్రీ స్వామివారి శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజన్న ఆలయం మెట్లమీద ఇచ్చిన హామీని తప్పాడని, తన పెళ్లి ఇక్కడే అయ్యిందని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే 100 కోట్ల రూపాయలు విడుదల చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పటి వరకు అలాగే ఉందని, రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధిని చూపించారని ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు అమలవుతున్నాయన్నారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని, అయినప్పటికీ రోడ్ల వెడల్పు కోసం భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువబోమన్నారు. మెయిన్ రోడ్‌లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని, పట్టణ ప్రజలకు, యాత్రికులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు

మంత్రి పదవులు

- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనకు గడ్డం వివేక్‌కు, వాకిటి శ్రీహరిలకు ఒకే రోజు మంత్రి పదవులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో విలేకర్లతో మాట్లాడారు. మా ఇంటి ఇలవేల్పు, కుల దైవం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారన్నారు. అమ్మవారి దర్శనం అనంతరమే ఏ కార్యక్రమైనా మొదలు పెడుతామని చెప్పారు. 1984 నుంచి ఎన్ఎస్‌యూఐ నుంచి మొదలుకొని నేటి వరకు కాంగ్రెస్‌లో తన ప్రయాణం కొనసాగుతుందని అన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జూడోయాత్ర దేశ రాజకీయాలన మార్చిందని అన్నారు. ఈ యాత్ర సామాజిక న్యాయానికి పునాది వేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రమాదం ఉందని తెలిసినా రాహుల్‌గాంధీ యాత్రను కొనసాగించడం చరిత్రాత్మకమని కొనియాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్న బియ్యం, రికార్డ్ స్థాయిలో రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయా ణం, 59వేల ఉద్యోగాలను ఇచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శిం చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే సోషల్ జస్టిస్‌కు కేరాఫ్ అని తెలిపారు. ధర్మపురి ప్రజల దీవెనలతో, కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతల ఆశీస్సులతో, సీఎం రేంత్‌రెడ్డి కృషితో నాకు అప్పగించిన మంత్రి పదవిని సమర్థవంతంగా నిర్వ హించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న మంత్రి సోమవారం ఉదయం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభతో ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీస్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రాధాబాయి శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

ప్రధాన సమస్యలపై దృష్టి మరల్చేందుకే

ఏసీబీ విచారణ పేరుతో హడావుడి

- బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటాం
- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమ స్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేటీఆర్ విచారణ సందర్భంగా తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమని, బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటామని, మాపై బయటి వారు ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని ఆమె పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నవదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుం దన్నందుకే నోటీసులు, విచారణల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ఏ పార్టీలోనైనా లోపాలు ఉన్నప్పుడు అధినేతకు చెప్పుకోవడం సహజంగా జరుగుతుందన్నారు. చెప్పుకున్నంత మాత్రాన దాన్నేదో భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేదన్నారు.

వానాకాలం పంట సీజన్ మొదలైనప్పటికీ రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. హామీల అమలుపై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారణ చేసిందని, తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ విచారి స్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు వేధింపులకు భయపడే వాళ్లు కాదని.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారని వివరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగిత్యాల నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎంపీ దామోదర్ రావు ఎంపీ లాడ్స్ నుంచి రూ.90 లక్షలు కేటాయించారని, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మరో రూ.10 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జగిత్యాల, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్లు శీలం ప్రియాంక, ఉదయశ్రీ, నాయకులు మారంపల్లి రాణి, మహేశ్, సంధ్యారాణి, శారద, తుమ్మ గంగాధర్, బర్కము మల్లేశం, అనిల్, తేలు రాజు, గంగారెడ్డి, అనుధార, తిరుపతి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్, 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన ఎల్ఎల్ఎం ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని

విరమించుకోవాలి

- మావోయిస్టుల పేరుతో ఆదివాసులను అంతం చేయడం సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సిరిసిల్లలో సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (అంధ్రజ్యోతి) : దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన నరమేధం విరమించుకోవాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాలుగవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి లహరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ తీశారు. లహరి ఫంక్షన్‌హాల్‌లో మహాసభల సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నాయ కురాలు అనసూర్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతలో భాగంగా దండకారణ్యంలో ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో కలిసి నరమేధాన్ని సృష్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ మతవాద పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డమీద కరుడుగట్టిన ఆ పార్టీని అడుగు పెట్టనీయ కుండా ప్రజలందరం ఐక్యం కావాలన్నారు. గత పాలకులు అనేక భూఆక్రమణలకు పాల్పడి నిరుపేద భూములను తీసుకున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో వీలైన మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలన్నారు. దీనికి కోసం ఇప్పటినుంచే బలంగా ఉన్న ప్రాంతాలల్లో ప్రచారం చేపట్టాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద సుదర్శన్ నియమాకం

రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఇల్లంతకుంట మండలం వెంట్రావుపల్లె గ్రామానికి చెందిన మంద సుదర్శన్‌తో పాటు 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మాణాలను అమోదించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, మీసం లక్ష్మన్, పంతం రవి, ఎలిగేటి రాజశేఖర్, భూంపెల్లి భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అరుణోదయ కళా సంఘం గౌరవ అధ్యక్షురాలు విమలక్క డిమాండ్‌చేశారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఛత్తీస్‌గడ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేస్తుందని, కేంద్ర బలగాలతో అడవులను జల్లెడ పడుతూ ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను అదాని, అంబానీలకు దోచి పెట్టడానికి కుట్ర చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు 2026వరకు మావోయిస్టు పార్టీని అంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని, దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో 570మందిని హత్య చేశారని ఆరోపిం చారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని చౌరస్తా నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. విశ్వనాథ్, రత్న కుమార్, విజయ్‌కుమార్, ఆరెల్లి కృష్ణ, మాదన కుమారస్వామి, మాదాసు రామమూర్తి, ముడిమడుగుల మల్లన్న, తాండ్ర సదానందం, రాజన్న పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాలలో కొత్త కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీకాం(రిటైల్ ఆపరేషన్స్) అనే కొత్త డిగ్రీ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు టి.రాజయ్య, దోస్త్ కోఆర్డినేటర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కండక్టర్ లేకుండానే బస్సు తీసుకువెళ్లిన డ్రైవర్

కళ్యాణ్ నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కండక్టర్ లేకుండానే డ్రైవర్ బస్సును తీసుకువెళ్లిన ఘటన సోమవారం గోదావరిఖని బస్టాండ్‌లో చోటుచేసుకుంది. గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్02 జెడ్-0286 బస్టాండ్‌లో కరీంనగర్‌కు ప్రయాణికులను ఎక్కించుకున్నారు. కండక్టర్ లేకుండానే బస్సును డ్రైవర్ మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వరకు తీసుకు వెళ్లారు. కండక్టర్ లేదని ప్రయాణికులు చెప్పినప్పటికి వినకుండా బస్సును తీసుకు వెళ్లాడు. బస్సులో ప్రయాణికుడు ప్రవీణ్ డిపోమేనేజర్ నాగభూషణానికి ఫిర్యాదు చేశాడు. దీంతో డ్రైవర్ బస్సును తిరిగి బస్టాండ్‌కు తీసుకు వచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు దిగి మరో బస్సులో వెళ్లిపోయారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కండక్టర్ లేకుండా బస్సును తీసుకు వెళ్లాడని, తాము చెప్పిన వినలేదని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే వారి పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నించారు.

గుట్టల మట్టి మాయం..

- వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని గుట్టల్లోని మట్టిని అక్రమార్కులు మాయం చేస్తున్నారు. పచ్చదనంతో కనబడే గుట్టలు నేడు బొందల గడ్డలుగా మారాయి. గుట్టలు ఉంటే చాలు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి, గణేష్‌నగర్, బోర్నపల్లి, ఎలబోతారం గ్రామాల్లో ప్రభుత్వ గుట్టలు మట్టితో నిండి ఉన్నాయి. వీటిపై కొంత మంది అక్రమార్కులు కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ గుట్టల నుంచి బహిరంగంగా ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తవ్వుతున్నారు. హుజూరాబాద్‌లో ఇటీవల ఇళ్ల నిర్మాణం బాగా పెరిగింది. దీనికి మట్టి అవసరం ఉండగా, పరిసరా ప్రాంతాల్లో దొరకడం లేదు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మట్టిని వ్యాపారం చేస్తున్నారు.



టిప్పర్ మట్టికి రూ. రెండు వేలు

హుజూరాబాద్‌లో టిప్పర్‌కు 1700 నుంచి రెండు వేల రూపాయల వరకు తీసుకుని మట్టిని తరలిస్తున్నారు. గతంలో పచ్చదనంతో కళకళలాడిన గుట్టలు ఇప్పుడు భారీ గుంతలుగా మారాయి. మట్టిని తరలిస్తున్నవారు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. గుట్టల నుంచి మట్టిని తరలిస్తుండడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి తరలి వస్తున్నాయి. గుట్టల నుంచి తీసుకొచ్చిన మట్టిని కొత్తపల్లి, గణేష్‌నగర్, రంగాపూర్ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తు న్నారు. అక్కడి నుంచి అవసరము న్న వారికి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ దందాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో గుట్టల వద్ద తవ్విన మట్టి

బొందలగడ్డగా మారిన గుట్టలు

రాజేందర్, గ్రామస్థుడు, రంగాపూర్



ఒకప్పుడు పచ్చదనంతో ఉండే గుట్టలు నేడు బొందలగడ్డగా మారాయి. గుట్టల్లో నుంచి మట్టిని అక్రమంగా తోడేస్తున్నారు. నిత్యం వేలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి.

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ రూరల్/గన్నేరువరం/చొప్పదండి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తున్నదని ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం అన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను సోమవారం గన్నేరువరం మండలం మాదాపూర్, చొప్పదండిలో వేర్వేరుగా వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ ప్రియదర్శిని, ఏవో వంశీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు భరోసా కల్పిస్తోందని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్, దుర్శేడ్, చామనపల్లి రైతువేదికల్లో రైతు నేస్తంను వీక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో మహేశ్వర్, దుర్శేడ్ సింగిల్ విండో ఛైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో సంజీవరావు, మండల వ్యవసాయ అధికారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంతో పాటు సిరిసేడు, బూజునూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమాన్ని సోమవారం అధికారులు, రైతులు వీక్షించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి రైతు వేదికలో రైతు నేస్తం నిర్వహించినట్లు ఏడీఏ సునీత తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి, సుందరగిరిలో మానకొండూర్ ఏడీఏ శ్రీధర్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో మధుసూదన్, మండల వ్యవసాయాధికారి రాజుల నాయుడు పాల్గొన్నారు.

మానకొండూర్: పచ్చునూర్ రైతువేదికలో కార్యక్రమం నిర్వహించారు.

గంగాధర: గంగాధర రైతువేదికలో ఏఎంసీ ఛైర్మన్ రజితశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాము, సింగిల్‌విండో ఛైర్మన్ తిరుమల్‌రావు, ఏవో శ్రీనివాస్, ఏఈవోలు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రామడుగు, గోపాల్‌రావుపేట, రంగసాయి పల్లి రైతువేదికల్లో కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ తిరుమల, తహసీల్దార్ రాజేశ్వరి, ఏఈవో సుమాంజలి, కొక్కెరకుంట ప్యాక్స్ ఛైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మండలవ్యవసాయాధికారి త్రివేదిక, ప్రసన్న కుమార్, రమేష్,రమ్య, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ సత్యంరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న పాల్గొన్నారు.



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



దుర్శేడ్‌లో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

‘బెస్ట్ అవైలబుల్’ ప్రవేశాలు ఉండేనా?

(5వ పేజీ తరువాయి)

తరగతి పరీక్ష రాయగా 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 25 శాతం మంది 500 పై మార్కులు పొందారు. తాము కార్పొరేట్ సంస్థలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నా నిధులు విడుదల చేయకపోవడం సమంజసం కాదని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రెండు సంవత్సరాలుగా ఫీజు బకాయిల విడుదల చేయకపోవడంతో భవనాలకు అద్దె చెల్లించలేక, హాస్టల్ విద్యార్థుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తమకు పాఠశాలలు మూసివేయడం మినహా మరోమార్గం కనిపించడం లేదని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ అధ్యక్షుడు కేశ వీరన్న, ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ పథకం అమలును సజావుగా కొనసాగించడానికి వెంటనే 200 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ నిర్బంధం

- వడ్ల కొనుగోళ్ల కమీషన్ ఇవ్వడం లేదని మహిళల ఆరోపణ



పోరండ్ల మహిళా సంఘ భవనంలో సీసీ రాజేందర్

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయడం లేదని ఆరోపిస్తూ ఓ మహిళాసంఘం సభ్యులు కమ్యూనిటీ కోఆర్డినేటర్ వడ్లూరి రాజేందర్‌ను గదిలోవేసి నిర్బంధించిన సంఘటన మండలంలోని పోరండ్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సదాశివ గ్రామీణ సంఘం 2011-12లో ధాన్యం మార్కెటింగ్ సంబంధించి వచ్చే కమీషన్ డబ్బులు రూ.7,48,000లను బాలాజీ గ్రామసమాఖ్య సంఘం వారు తమ ఖాతాలో వేసుకున్నారు. దీనిపై బాలజీసంఘం వారిని ప్రశ్నిస్తే డబ్బులు ఇవ్వమని చెప్పడంతో వారు దీనిపై మండల, జిల్లా సమాఖ్య వారి దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. చివరికి అధికారులు రూ.5లక్షల 6వేలను సదాశివ గ్రామసమాఖ్య సంఘానికి ఇవ్వాలని తీర్మానించారు. ఆ ప్రకారం కూడా బాలజీ మహిళా సంఘం వారు డబ్బులు ఇవ్వడం లేదన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళితే పట్టించుకోవడం లేదన్నారు. వారికి సీసీ అయిన రాజేందర్ సహకరించడం వల్లే వారు డబ్బులు ఇవ్వడం లేదని అందుకోసమే సోమవారం పోరండ్లలో గల స్వశక్తి మహిళా సంఘ భవనానికి వచ్చిన కమ్యూనిటి కోఆర్డినేటర్ రాజేందర్‌ను నిర్బంధించామని అన్నారు. ఇప్పటికైనా తమకు వచ్చే డబ్బులు వెంటనే ఇప్పించాలని సదాశివ గ్రామీణ మహిళా సంఘం సభ్యులు కోరారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు శాతవాహనయూనివర్సిటీ కార్మికులు సిద్ధమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తయారు చేసిన సమ్మెబుక్‌లెట్‌ను సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ముల్కల దేవేందర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి రాజు, రజిత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్‌వన్, టూ, రూరల్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 10:30 వరకు బైపాస్ ఏరియా ఎన్టీఆర్ విగ్రహంనుంచి సబ్‌స్టేషన్ వరకు, ఉజ్వల పార్క్, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాల, హోటల్ శ్రద్ధయని, మాతృభూమి అపార్ట్‌మెంట్, ఉదయం 8గంటల నుంచి 10 వరకు పొన్నంకాంప్లెక్స్, శ్రీరాంబుక్‌స్టాల్, అన్వర్ టీస్టాల్, మంకమ్మతోట, బృందావన్ అపార్ట్‌మెంట్, గీతాభవన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ఫైర్ స్టేషన్, ఆర్‌బీ స్వీట్ హౌస్, ముకరంపూరా, ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఇరుకుల్ల, ముగ్దుంపూర్, ఏజీఎల్, ముగ్దుంపూర్ రైస్‌మిల్‌ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాఉండదని తెలిపారు.

పులి ఆంజనేయులుకు పరామర్శ

రామడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ బీసీసెల్ ఛైర్మన్ పులి అంజనేయులుగౌడ్ తండ్రి పరశురాంగౌడ్ అనారోగ్యంతో రెండురోజుల క్రితం మరణించగా ఆయన కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, సర్పంచ్ కోల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ బ్యాంకు ఎన్నికల్లో 11నామినేషన్లు

భీమదేవరపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార బ్యాంకులో ఐదు డైరెక్టర్ స్థానాలకు 11 నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. జనరల్‌కు కేటాయించిన 1వ డైరెక్టర్ స్థానానికి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

జమ్మికుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా పర్లపల్లిలోని జిల్లా ఉన్నతపాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న బానోత్ సత్యజ్యోత్ అనే ప్రభుత్వఉపాధ్యాయుడు తనకుమారుడు సుశాంత్‌నాయక్‌ను జమ్మికుంట ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 9వతరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలపై తనకు ఉన్న నమ్మకంతోనే తన కుమారుడిని చేర్పించానని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.

దేశరాజుపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రామడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం చూపిన రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామకార్యదర్శి కె అంజయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీచేశారు. కె అంజయ్య తన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి నిబంధనలకు విరుద్ధంగా చర్యలు తీసుకున్నట్లు గుర్తించి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

రేపు క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాపాఠశాల ఎంపిక పోటీలు ఈనెల18న నిర్వహిస్తున్నట్లు ఎంఈవో భూపతిశ్రీనివాస్ తెలిపారు. సోమవారం హుజూరాబాద్‌లో క్రీడాపాఠశాల ఎంపిక పోటీలపై పీడీ, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హుజూరాబాద్ హైస్కూల్‌లో క్రీడాపాఠశాల ప్రవేశ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో 4వతరగతి చదువుతూ సెప్టెంబరు1, 2016నుంచి ఆగస్టు 31, 2017 మధ్య జన్మించిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ఫామ్, 4వ తరగతి చదువుతున్న బోనఫైడ్ సర్టిఫికెట్, 5ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకొని హాజరు కావాలన్నారు.

ఇల్లందకుంట: మండలంలో 4వతరగతి చదువుతున్న విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశంకోసం సామర్థ్యపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాములు తెలిపారు. ఈ నెల18న మండలంలోని సిరిసేడు హైస్కూల్‌లో క్రీడాపోటీలు జరుగు తాయని పేర్కొన్నారు.

● న్యూస్‌బాక్స్

వీణవంక: కొత్తగా పట్టాలు పొందిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేష్ ప్రకటనలో తెలిపారు.

గంగాధర: మండలంలోని కాచి రెడ్డి పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో నర్సింగరాణి అక్షరాభ్యాసం చేయించారు.

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సంఘం జేఏసీ కన్వీనర్‌గా ఎంపికైన పీచర కృష్ణమాచార్యులను సోమవారం పలువురు సన్మానించారు.

సుభాష్‌నగర్: రైతుబంధు విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డికి రైతు ప్రజా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పొలాడి రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

కరీంనగర్ టౌన్: విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బిల్లు అమలు పరిచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజ పడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

మానకొండూర్: మండలంలోని ఊటూర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సులో 154 దరఖాస్తులను స్వీకరించారు.

చొప్పదండి: భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు. గుమాపూర్‌లో సదస్సు నిర్వహించారు.

గంగాధర: మండలంలోని నాగిరెడిపూర్ సదస్సులో దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు.

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు డివిజన్‌ల లోని స్థానికేతరుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని ప్రకాశం గంజ్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సెక్షన్ పరిధిలోని సబ్‌స్టేషన్ విద్యుత్ సిబ్బంది మొబైల్ నంబర్లు మారినట్లు ఏఈ సంపత్‌రెడ్డి సోమవారం తెలిపారు.

● మండలంలోని తాడికల్‌లో ఎస్సారెస్పీ ఉపకాలువ పూడ్చివేతపై డీఈ కవిత విచారణ చేపట్టారు.

జమ్మికుంట: ఏ కారణం చేతైనా చదువుకోలేక పోతున్న బాలురకు మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రయమిచ్చి చదివిస్తుందని నిర్వాహకుడు వీరస్వామి తెలిపారు.

సుభాష్‌నగర్: తమ డివిజన్‌లోని రోడ్లకు మరమ్మతుచేపట్టాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

●వాసవీక్లబ్ శాతవాహన ఆధ్వర్యంలో సోమవారం డాన్ టు డస్క్ పేరిట పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వీఎస్ఎల్ యెర్రం సుజాత, వైస్ గవర్నర్1 పుల్లూరి బాలమోహన్, వైస్ గవర్నర్2 ప్రదీప్ పాల్గొన్నారు.

● గత నెలలో ప్రమాదంలో మరణించిన తిప్పర్తి కృష్ణ కుటుంబానికి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రావుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.లక్షా 34 వేలను కృష్ణ కుమారుడు అఖిల్(11) పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసిన బాండ్‌ను సోమవారం అందజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచిన కలెక్టర్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో సైనసైటీస్ సర్జరీ చేయించుకొని ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కలెక్టర్ పమేలా సత్పతిని ఫోన్ ద్వారా అభినందించారు. గత కొన్ని నెలలుగా తలనొప్పి ముక్కు దిబ్బడ, నాసిక అడ్డంకి సైనసైటీస్‌తో బాధపడుతున్న కలెక్టర్ ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో చేరి సర్జరీ చేయించుకున్న విషయం తెలిసి సోమవారం ఆమె ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. 'కలెక్టర్ గారు శభాష్' అంటూ.. కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునే అవకాశమున్నా ప్రభుత్వ ఆసుపత్రిలో సర్జరీ చేయించుకోవడం శుభపరిణామమని అన్నారు. ఆధునిక సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్న సర్కారీ దవాఖానాల్లో నాణ్యమైన వైద్య సేవలందుతాయని ప్రజలకు నమ్మకాన్ని కలిగించినందుకు ప్రత్యేక అభినందనలని అన్నారు. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ట్రినిటి విద్యాసంస్థల్లో అత్యుత్తమ బోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న దాసరి మనోహర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ట్రినిటి విద్యాసంస్థల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నట్లు ట్రినిటి విద్యాసంస్థల కార్యదర్శి, సంచాలకులు దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో అత్యాధునిక సౌకర్యాలతో, హోలిస్టిక్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే సీబీఎస్ఈ కరికులం అనుసరిస్తున్న ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రినిటీ విద్యాసంస్థలు విద్యను ఒక సేవగా భావించి సమాజానికి మంచి నాయకులను అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. కరీంనగర్‌లోని పిల్లలంతా ప్రపంచస్థాయి విద్యను స్వగ్రామంలోనే పొందాలన్న దృష్టితో ఈ సంస్థను నెలకొల్పుతున్నామన్నారు. ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌లో విద్యార్థుల మొత్తం అభివృద్ధికి అనుకూలంగా అత్యుత్తమ ఉపాధ్యాయ బృందం, సమగ్రమైన బోధనా విధానాలు, ప్రపంచ ప్రమాణాలకు సరిపోయే విశాలమైన ఆట స్థలంతో కూడిన అద్భుతమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం సంస్థ కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థి



అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బాలాజీ

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని రోతక్‌లో ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.స్మిత రెడ్డి ఎంపికైంది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 75, 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ సోమవారం తెలిపారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో స్మిత్ర తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను, బాక్సింగ్ కోచ్ రామకృష్ణను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనూకర్‌రావు, వినోద్‌రావు, వీయుఎం ప్రసాద్, పీఎస్‌సి రమణ, హనుమంతరావు, ప్రశాంత్, కవిత, సమన్వయకర్త శ్రీనాథ్ అభినందించారు.

కరీంనగర్ క్రైం: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన స్మితరెడ్డిని సీపీ గౌస్ ఆలం అభినందించారు. సోమవారం తన తాత రిటైర్డ్ ఎస్సై మల్లారెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా సీపీని కలిశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

భగత్‌నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు, స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ క్లాస్‌రూంలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోనే బాగా చదువుకుంటారన్న అపోహను వీడాలన్నారు. నూతనంగా పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు బ్యాగులు పంపిణీచేశారు. ఎంఈవో ఆనందం, కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

జమ్మికుంట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల పీహెచ్‌సీని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ చందు సోమవారం తనిఖీ చేశారు. ఫార్మసీ గది, ల్యాబ్, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ క్లినిక్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, లెప్రసి సర్వేను ఆశాకార్యకర్తలు గ్రామంలో విధిగా చేపట్టాలని అన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతి మంగళ, శుక్రవారం జరపాలని సూచించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ రాజేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

రామడుగు జూన్ 16 (ఆంధ్రజ్యోతి):: రామడుగు మండలం వెలిచాలకు చెందిన వ్యక్తి ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.38 లక్షల టాటా హెల్త్ ఇన్సూరెన్స్ చెక్కును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం అందజేశారు. అనంతరం టాటా హెల్త్ ఇన్సూరెన్స్ అధికారులను సన్మానించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ అన్నారు. ఎల్ఎండీకాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం తిమ్మాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల బారినపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యంపొందాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి వైద్యం పొందిన పేదలు సకాలంలో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక ఉచితం

మానకొండూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎమ్మార్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉచితంగా ఇసుకను పంపిణీ చేయనున్నట్లు సీఎం ప్రకటించడం సంతోషకరమన్నారు. ఏఎంసీ ఛైర్మన్ మర్రి ఓదెలు, ఎంపీడీవో వరలక్ష్మీ, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్ ఉన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయ జూనియర్‌కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో కె.నీత్ 468/470, సహస్ర, సంజన 467/470, తనుశ్రీ, యశశ్రీ 466/470, బైపీసీలో నాగవిశిష్ట 438/440, వైష్ణవి 437/440, శ్లేష 436/440, హుజ్రసదాఫ్ 435/440, సీఈసీలో గోమతి 494/500 రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

ఉషు అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉషు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక ఫండస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశం అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బార విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి శేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మోయిన్ అహ్మద్, ఎ.శ్రీనివాస్, బి.రావు, పి.లింగమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా బి.రానా విక్రమ్ గాంధీ, జె.మహేష్, ఎండీ ముఫాజిల్, పి.నాగరాజు, కోశాధికారిగా కె.అఖిల, కార్యవర్గ సభయలుగా జె.విజయ్ సామ్రాట్, జి.శివకృష్ణ, బి.రమేష్, ఎల్.రవివర్మ, కె.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి.అజయ్ కుమార్ ప్రకటించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి ఎస్.సిద్ధారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి వి.కిష్టయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఉషు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, పరమేష్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

భూ కబ్జాలకు పాల్పడలేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇనుకొండ జితేందర్ రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాను గ్రామసర్పంచ్‌గా ఉన్న సమయంలో ప్రజల అవసరాల కోసం సొంత డబ్బులతో భూమిని కొనుగోలు చేసి ఇచ్చానే తప్ప ఎప్పుడూ కబ్జాలకు పాల్పడలేదని కొత్తపల్లి గ్రామమాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం మండలంలోని కొత్తపల్లిలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గ్రామంలో ఒకరిద్దరు తనపై తప్పుడు సమాచారం ఇస్తే దానినే ప్రామాణికంగా తీసుకొని గ్రామాభివృద్ధి కోసం వంకరగా ఉన్న 18ఫీట్ల నక్ష తోవను, సరిగ్గా చేసి 30ఫీట్లగా మార్చామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వచ్చిచూస్తే వాస్తవాలు తెలుస్తాయని తెలిపారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ తిరుపతిగౌడ్, గ్రామస్థులు నోముల రాజేష్, నోముల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మరాజుపల్లి, పెద్దపాపయ్యపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ధర్మరాజుపల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన లబ్ధిదారులతో ముచ్చటించారు. ఎన్నో ఏళ్ల ఇంటికలను కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపాపయ్యపల్లి గ్రామంలో 27 మందికి ఇళ్లు మంజూరు కాగా 20మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాశిపాక రాజేష్



టీపీసీసీ ప్రధానకార్యదర్శి రాజేష్‌ను అభినందిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడం కాంగ్రెస్‌కే సాధ్యమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాశిపాక రాజేష్‌అన్నారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియామకమై సోమవారం మొదటి సారిగా కరీంనగర్‌కు వచ్చిన రాజేష్‌కు నగరంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అనంతరం డీసీసీ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ తనను టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరా చౌక్ వద్ద యువజన కాంగ్రెస్ నాయకుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో ఆయనను గజమాలతో సన్మానించారు.